

'పాయల'కు శిఖామణి పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ కవి శిఖామణి పేర ప్రదానం చేసే జీవన సాఫల్య పురస్కారానికి, వాడ్రేవు చిన వీరభద్రుడు యువపురస్కారానికి విజయనగరానికి చెందిన పాయల మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు ఎంపిక కమిటీ అధ్యక్షులు ప్రముఖకవి దాట్ల దేవదానం రాజు తెలిపారు. అక్టోబర్ 27న యానాంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును మురళీకృష్ణకు అందజేయనున్నారు. నగదు బహుమతి జాపికతో సత్కరించనున్నారు. ఈయన రాచకిండాం జెడ్‌పి హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సన్యాసి రాజు, సిబ్బంది ఆయనను అభినందించారు.

పాయల మురళీకృష్ణ

ఘనంగా గురజాడ జయంతి

గురజాడ స్ఫూర్తి అవార్డు ఏర్పాటు చేయాలి : మంత్రి కొండపల్లి ● కవులు, కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గొప్ప సామాజిక స్పృహతో రచనలు చేసిన మహాకవి గురజాడ వెంకట అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ఆయన గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు ఆయన పేరిట గురజాడ స్ఫూర్తి అవార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రతీ పాఠశాలలో గురజాడ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నవయుగ వైతాళికులు గురజాడ 162వ జయంతి వేడుకలు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. గురజాడ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జయంతి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయనతో విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిమ గజపతిరాజు, ఎంఎల్‌సి పి.సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్‌అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, గురజాడ కుటుంబ సభ్యులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర, లలిత, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేశలి అప్పారావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సాహితీ సంస్థల ప్రముఖులు, కళాకారులు, జిల్లా అధికారులు పాల్గొని గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి గురజాడ కూడలి వద్దకు ప్రదర్శనగా చేరుకొని ప్రముఖులంతా మహాకవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన గురజాడ ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గురజాడ రచనలు ఇప్పటికే పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయని, ఆ మహనీయుని జీవిత చరిత్ర కూడా చేర్చడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. గురజాడ రచనలను వెలుగులోకి తెచ్చి, అతని గొప్పదనాన్ని వివరించిన ప్రముఖ కవి వెలుగు రామినాయుడికి ఈ సందర్భంగా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, గురజాడ రచనలు నిత్యనూతనమని, అందరికీ స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, మహాకవి గురజాడ చిరస్మరణీయులని పేర్కొన్నారు. ఆ కాలంలోనే తన కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలో మార్పు తెచ్చేందుకు గురజాడ కృషి చేశారని అన్నారు. ప్రముఖ కవులు జిఎస్ చలం, చీకటి దివాకర్, గురజాడ కుటుంబీకులు ఇందిర, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ గురజాడ గొప్పదనాన్ని కొనియాడారు. గురజాడ కుటుంబ సభ్యులు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత, శ్రీకర్, ప్రముఖ కవులు, కళాకారులు, వెలుగు రామినాయుడు, జిఎస్ చలం, చీకటి దివాకర్, ఎన్.కె.బాబు, ఈపు విజయకుమార్, ఇనుగంటి జానకి, బి.సూర్యలక్ష్మి, టి.అనిల్‌కుమార్‌లను ఈ సందర్భంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా రమణకుమారి బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యం, గురజాడ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, దేశమును ప్రేమించుమన్నా, మహారాజా సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశమంటే మట్టికాదోయ్ సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతమూ అలరించాయి.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, డిఐపిఆర్‌ఒ డి.రమేష్, డిటిఒ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి.రాజు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.శివప్రసాదరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు, సాహితీ ప్రముఖులు జక్కు రామకృష్ణ, కన్యాశుల్కం కళాకారులు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్

ఆకట్టుకున్న గురజాడ విద్యార్థుల కళారూపాలు

విజయనగరంటౌన్ : గురజాడ జయంతి సందర్భంగా గురజాడ పాఠశాల విద్యార్థుల కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 150 మంది విద్యార్థులతో గురజాడ ఇంటి వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి గురజాడను స్మరించుకున్నారు. గురజాడ దేశభక్తి గేయంలో ఉన్న పలు అంశాలను ప్లకార్డులపై వ్రాసి ఊరేగింపులో పాల్గొన్నారు. కలెక్టరేట్ లో జరిగిన సభలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కథ, దేశమంటే మట్టికాదని నృత్య ప్రదర్శన అలరించాయి. 10మంది చిన్నారుల గురజాడ వేషధారణ సభికులను ఆకట్టుకున్నాయి. గురజాడ పాఠశాలలో జరిగిన జయంతి సభలో పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన 'జెండా పై గురజాడ' నాటిక విద్యార్థులను ఆలోచింపజేసింది.

కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

గురజాడ వేషధారణలో ఉన్న విద్యార్థులతో మంత్రి శ్రీనివాస్, కలెక్టర్

గురజాడ రచనలు సజీవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు రాసిన రచనలు సమాజంలో సమస్యలు ఉన్నంతకాలం సజీవంగానే ఉంటాయని ప్రముఖ రచయిత జిఎస్ చలం, గురజాడ ముని మనుమడు వెంకట ప్రసాద్ అన్నారు శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 162వ గురజాడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'గురజాడ సాహిత్యం-అభ్యుదయ దృక్పథం' అనే అంశంపై జరిగిన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ గురజాడ వెంకట అప్పారావు. వ్యవహార భాషలో ప్రజలందరికీ చేరువయ్యాడని, అందుకే నవయువ వైతాళికునిగా పేరు గాంచాడని అన్నారు. అందుకే 'కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ' అని మహాకవి శ్రీశ్రీ పేర్కొన్నారని తెలిపారు. 'గురజాడ చనిపోలేదు.. అప్పుడే జీవించడం మొదలెట్టాడు' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి కొనియాడారని గుర్తు చేశారు. కన్యాశుల్కం అనే ఆచారం పోయినప్పటికీ ఆ నాటకం నేటికీ ఉందంటే ఆ పాత్రలన్నీ సజీవంగా ఉండడమేనని అన్నారు. గురజాడ రచనలు ఎప్పటికీ సమాజానికి ఆదర్శంగా ఉంటాయని తెలిపారు. గురజాడ ముని మనుమడు అప్పారావు మాట్లాడుతూ గురజాడ రచించిన దేశభక్తి గేయం ఏ దేశానికైనా అన్వయించు కోవచ్చునని అన్నారు. ఆయన రాసిన కన్యాశుల్కంలో సమాజంలో జరుగుతున్న రుగ్మతలను ఆనాడే ఎత్తి చూపారని అన్నారు సాంఘిక దురాచారాలను రూపుమాపడం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆనాడు ఎక్కువగా సమాజంలో ఉండే సాంఘిక దురాచారాలను రూపు మాపేందుకు తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. ప్రధానంగా వితంతు పునర్వివాహాలకు నడుం బిగించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో గురజాడ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు శ్రీనివాసరావు, శ్రీదేవి రాజశేఖర్ అనేకమంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు, ఇందిరలను సత్కరించారు.

గురజాడ బాటలో పయనిద్దాం

విజయనగరం టౌన్ : దేశభక్తి గేయాన్ని రాసి దేశ మంటే మనుషులని చాటిచెప్పిన సంఘసంస్కర్త , మహా కవి గురజాడ అప్పారావు బాటలో పయంచాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడ్పడాలని గురజాడ పిలుపుని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. శనివారం గాజులరేగలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తున్నదని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి గురజాడ అని కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, బుజ్జమ్మ, దేవుడమ్మ,లక్ష్మి తది తరులు పాల్గొన్నారు. అనంతరం తోట పాలెం ముచ్చువాణి చెరువు గట్టు పై గురజాడ జయంతి నిర్వహించారు. ఐద్వా నాయకులు వి.లక్ష్మి, పి. రమణమ్మ సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్‌రావు గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

నివాళులర్పిస్తున్న కవులు జిఎస్ చలం, గురజాడ కుటుంబ సభ్యులు; సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

పైడితల్లమ్మ జాతరలో ప్రజల భాగస్వామ్యం

మేయర్ విజయలక్ష్మి ● 35 అంశాలను ఆమోదించిన స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలందరి సహకారంతో పైడితల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శనివారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. 35 అంశాలను అజెండాలో, ఒక అంశం టేబుల్ అజెండాగా పొందుపరిచారు. అన్ని అంశాలకు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జివి రంగారావు, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే పైడితల్లమ్మ జాతరలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పిస్తూనే పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పొందుపరిచిన అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలపడం అభినందనీయ మన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ తొలి సమావేశంలో పొందుపరిచిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

మార్చి నాటికి ఇళ్లు పూర్తి చేయాలి

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో మంజూరైన గృహాలన్నిటినీ పూర్తి చేయడానికి మన ఇల్లు- మన గౌరవం పేరుతో ప్రభుత్వం ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈనెల 28న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్ నుంచి ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజినీర్లు, ఇఒపిఆర్‌డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 వేల గృహాలు మంజూరు చేశామని, అందులో కొన్ని ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కానివి ఉన్నాయని, ఇంకొన్ని వేర్వేరు దశలలో ఉన్నాయని వీటన్నిటి నిర్మాణాలు 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ప్రధానంగా మున్సిపాలిటీలలో ఎక్కువ లే ఔట్లు ఉన్నాయని, కమిషనర్లు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం కోసం గ్రామ స్థాయి లో నియమించిన ప్రత్యేకాధికారుల సేవలను మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమం లో వినియోగించుకోవాలని తెలిపారు. నిధుల కొరత లేదని, వేగంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ, ఆర్‌డిఒ సూర్యకళ, సిపిఒ బాలాజీ , హౌసింగ్ పీడీ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విశాఖ-అరకు హైవే పనుల్లో కదలిక

ప్రజాశక్తి-కొత్తవలస

విశాఖ- అరకు జాతీయ రహదారి -516బి పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. శనివారం కొత్తవలస మండలం చింతలపాలెం రెవెన్యూ పరిధిలో ఎన్‌హెచ్‌ఎ, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే ప్రారంభించారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు ఉన్న 40 కిలోమీటర్ల రహదారి పనులు ప్రారంభించేందుకు చింతలపాలెం జంక్షన్ నుంచి సర్వే ప్రారంభించారు. గతంలో నేషనల్ హైవే అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం, వసంత విహార్ లేఔట్ వెనుక భాగం నుండి రోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టారు. మార్కింగ్ ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న యజమానులను గుర్తించారు. చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారాం పాత్రుడు గ్రామంలో చేపడుతున్న సర్వేను దగ్గరుండి మరీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం ఉప సర్పంచ్ గొలగాని మజ్జి కనకేశ్వరరావు, మాజీ సర్పంచ్ పళ్ల రామయ్య, విఆర్‌ఒ గోవింద్, సర్వేయర్లు నిహారిక, సురేష్ పాల్గొన్నారు.

పంపుహౌస్ కార్మికులకు బేసిక్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేషన్ ప్రజలకుత్రాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దశాబ్దాలు గా పనిచేస్తున్నా జీతం మాత్రం రూ.11వేలు మాత్రమే అని , టెండర్ ప్రకారం జీతం చెల్లించటం లేదని ఎమ్మెల్యే అదితి విజయ లక్ష్మి వద్ద మున్సిపల్ కార్పొరేషన్ పంపు హౌస్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం అశోక్ బంగ్లా లో ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. పంపు హౌస్ కార్మికులకు బేసిక్ వేతనం టెండర్ ప్రకారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ స్కిల్ కార్మికులకు పారిశుధ్య కార్మికుల మాదిరిగా రూ. 21వేలు, స్కిల్డ్ కార్మికులకు 24500/- జీతం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్పొరేషన్ కమిటీ అధ్యక్షులు ఎ .జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు మురళి కోరారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రాజశేఖర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వంద రోజుల్లో రెడ్‌బుక్ పాలన

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

రాష్ట్రంలో గత వంద రోజుల్లో రెడ్‌బుక్ పాలన సాగిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆక్షేపించారు. శనివారం గజపతినగరంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల పాలనలో ఏం సాధించారని కూటమి నాయకులు గ్రామాల్లో సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. అధికారం చేపట్టినప్పటి నుండి వైసిపి అభిమానులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ, దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారే తప్ప సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా నెరవేర్చే ప్రయత్నం చేశారా? అని ప్రశ్నించారు. ఇంగ్లీష్ మీడియం, సిబిఎస్ఇ సిలబస్‌ను నిర్వీర్యం చేసి విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని విమర్శించారు. అమ్మకు వందనం అంటూ శఠగోపం పెట్టారని దుయ్యబట్టారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడం అత్యంత దుర్మార్గమని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేసే ప్రసక్తే లేదని ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికిన కూటమి నాయకుల మాటలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. వీటిని ప్రజలు మరచిపోయేలా చేయడానికి తిరుపతి లడ్డులో కల్తీ.. అంటూ పక్కదారి పట్టించే రాజకీయాలకు తెరలేపారని కూటమి నాయకులపై విరుచుకుపడ్డారు. దీనిపై 'కుటుంబ సమేతంగా తిరుమల దేవస్థానంలో ప్రమాణం చేస్తాను. మీరు కూడా ప్రమాణం చేయాలి' అన్న టిటిడి మాజీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి సవాలుపై సిఎం చంద్రబాబు నుంచి ఇప్పటికీ స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వేమలి ముత్యాలు నాయుడు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కర్రి రామునాయుడు, కె.పైడిపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రజలకు తెలపండి

కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలపాలని నాయకులకు, కార్యకర్తలకు కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు సూచించారు. శనివారం విజయనగరం నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌తో పాటు జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించిందన్నారు. నియోజకవర్గం పరిధిలో జరిగిన అభివద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని నాయకులు సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ఎస్‌ఎఫ్‌ఐ స్టూడెంట్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 28, 29 ,30 తేదీల్లో గురజాడ కళాక్షేత్రం లో నిర్వహించే భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ జయప్రదం చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి ఆయన ఫెస్ట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ పోటీలతో సహా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీ యమన్నారు. యువతను డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ఒక మంచి లక్ష్యంతో ఎస్‌ఎఫ్‌ఐ చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రామ్మోహన్ మాట్లాడుతూ ఫెస్ట్‌లో కల్చరల్, వెస్ట్రన్, ఫోక్ డాన్స్, పాటలు, స్ట్రీట్ ప్లే, నాటికలు, భరతనాట్యం, స్టాండప్ కామెడీ, మిమిక్రీ , మ్యూజిక్ షో వంటి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రేలారే రేలా, థింసా , తప్పెటగుళ్ళు వంటి ప్రదర్శనలు కూడా ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు 9866302963 నెంబర్ కు సంప్రదించాలని కోరారు. బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొనాలనుకునే విద్యార్థులు 94943 33511 నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సి హెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ స్టూడెంట్ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

డ్రగ్స్ ను నిర్మూలిద్దాం..భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ పేరిట కోట జంక్షన్‌లో విద్యార్థులు చేసిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థి బృందాలు పలు సినిమా పాటలకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లడుతూ జిల్లాలో రోజురోజుకీ పెరిగిపోతున్న డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని దానిలో భాగంగా ఈనెల 28 29 30 తేదీలలో విజయనగరంలో గల గురజాడ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు జె. రవి, ఎస్ సమీరా, ఎం రమేష్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన శరత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి శరత్ చంద్ర నాయుడు రజిత పథకం సాధించి సత్తా చాటాడు. రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో పదేళ్ల విభాగంలో పథకం సాధించిన శరత్ చంద్ర నాయుడును పాఠశాల ప్రిన్సిపాల్ జి.లక్ష్మణరావు, ఛైర్మన్ సీతయ్య,డైరెక్టర్ వీరాస్వామి అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ పరికరాలు

విజయనగరం టౌన్ : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం రాక్ గార్డెన్‌లో సామూహిక శ్రమదానం చేశారు. మున్సిపల్ కార్మికులకు వ్యక్తిగత పరిరక్షణ పరికరాల పంపిణీ చేశారు. ప్రజారోగ్య సిబ్బంది అంబటి సత్రం నుంచి రాక్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరంలో ప్రజారోగ్య సిబ్బంది, స్వయం సహాయక గ్రూప్ సభ్యులు సంయుక్తంగా శ్రమదానం చేపట్టారు. కార్మికులకు సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు వ్యక్తిగత పరిరక్షణ పరికరాలను అందజేశారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఆర్‌ఒ సింహాచలం, సిఎంఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి మాటున

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు ఎగవేత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత.. ఆరోగ్య మే మహా భాగ్యం. వంటి సూక్తుల ఆధారంగా సామాజిక బాధ్యతను, చైతన్యం పెంచడం, ఆరోగ్యాన్ని పరిరక్షించడం మంచిదే. కానీ, ఈ నినాదాలతో ఆ పనులు చేస్తున్న కార్మికుల వేతనాలు ఎగ్గొట్టడం, వారి సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, ఈ వైఖరిపై నిలదీసిన వారి పట్ల వేధింపులకు పాల్పడడం సరికాదు.

కానీ, ఇటీవల స్వచ్ఛత హి పేరిట కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు అందుకను గుణంగానే కనిపిస్తున్నా యి. జిల్లాలోని చాలా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు కార్మికులు (గ్రీన్ అంబాస్‌డర్లు) వందలాదిగా ఉన్నారు. వీరికి కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇవ్వాలి. లేదా పంచాయతీ నిధుల నుంచైనా భరించాలి. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్ల పరిస్థితి దయనీయంగా మారింది. వీరికి చెల్లించేది నెలకు రూ.6వేలు. అదికూడా సక్రమంగా చెల్లించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీలవారీగా పరిశీలిస్తే 4నెలల నుంచి 16నెలలు వరకు వేతన బాకాయిలు ఉన్నాయి. చీపుర్లు, గ్లౌజులు, యూనిఫారాలు వంటివి కూడా ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. చెత్తసేకరించే బండ్లును కూడా మర్మతులు చేయడం లేదు. చివరికి వారి చేతులు కడుక్కోవడానికి సబ్బులు కూడా ఇవ్వడం లేదట. దీన్నిబట్టి పరిసరాల పరిశుభ్రతపైనా, ప్రజారోగ్యంపైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ

ఏపాటిదో వేరేగా చెప్పనక్కర్లేదు. ఆర్థిక సంఘం నిధులు సరికాగా విడుదల చేయడం లేదని, అరకొరగా ఇచ్చినవి కూడా కార్మికుల వరకూ చేరడం లేదని అర్థమౌతోంది. పరిస్థితి ఇలావుంటే స్వచ్ఛత హి పేరిట గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ఇటీవల పంచాయతీరాజ్ శాఖ పిలుపునిచ్చింది. ఈనెల 17న అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వం సిబ్బంది ఒకటే హడావుడి. చెత్తలు తీయడం, డొంకలు, తుప్పలు తొలగించడం వంటివి అక్కడక్కడ కనిపించాయి. వాస్తవానికి ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలి. ఈలోటును కప్పిపుచ్చుకునేందుకు సామాజిక సేవపేరిట ఇటువంటి కార్యాక్రమాలకు కేంద్రం పిలుపునివ్వడమే తడువుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ చేపట్టింది. దీనిపై ప్రజలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను ఎత్తుతున్న కార్మికులకు శఠగోపం పెట్టి, ఇటువంటి కార్యక్రమాలు చేపడితే సామాజికసేవకు జనం వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వానికి, పాలకులకు చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు వేతనాలు, పెంచడంతోపాటు సకాలంలో చెల్లించి, వారి ఆరోగ్యానికి భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. అలాగని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం తప్పని కూడా కాదు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి, ప్రజలను సామాజిక సేవచేయాలని కోరడమే ఆశ్చర్యకరమైన అంశం అని జనం వ్యాఖ్యానిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు నిధులు కొదవలేదని అధికారులు చెబుతున్నారు. అదే నిజమైతే ఎన్నో గ్రామాల్లో బ్లీచింగ్ కూడా ఎందుకు జల్లడం లేదు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇటీవల వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు ప్రబలాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్వచ్ఛతహి పేరుతో ఒక్కరోజు హడావుడి వల్ల ఉపయోగమేమీ ఉండబోదని పబ్లిక్ టాక్.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒ తిరుమల ప్రసాద్

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రామభద్రపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్ -14, 17 బాలబాలికల క్రీడా పోటీలను స్థానిక హైస్కూల్ ఆవరణలో శనివారం డిప్యూటీ డిఇఒ మోహనరావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 200 మంది క్రీడాకారులు ఏడు క్రీడాంశాల్లో పోటీ పడ్డారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించనున్నట్టు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ గొర్లె అప్పారావు, వైస్ చైర్మన్ సూర్యనారాయణ, హెచ్ఎం కామేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి విమానాశ్రయ సమస్యలు

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ సమస్యలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి మండలంలోని కవులవాడ పంచాయతీకి చెందిన కోరాడ తాతారావు తీసుకువెళ్లారు. శనివారం సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు పరిహార విషయంలో చాలామందికి అన్యాయం జరిగిందని ఆయనకు వివరించారు. జమ్ముయ్యపేట వెళ్లే రహదారి వర్షం పడితే విమానాశ్రయం వరద నీటితో రాకపోకలు చేయలేకపోతున్నామని వివరించారు. ఈ సమస్యలను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన వివరించినట్టు తాతారావు తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - గరివిడి

మండలంలో ఐతంవలస అంగన్వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌష్టికాహార ప్రదర్శన చేసి తల్లులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఎం జ్యోతి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చని, గర్భిణులు ప్రసవ సమయంలో ఆరోగ్యకరంగా ఉంటారని, తల్లీ బిడ్డ కూడా క్షేమంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పైడమ్మ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామస్తులతో శనివారం వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సమావేశం ఏర్పాటుచేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. లోన్‌యాప్‌ల వల్ల కలిగే కష్టాలు, సైబర్‌క్రైమ్ మోసాలపై వివరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఇఒ బాల భాస్కర్ రావు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొంపల్లి, ఎంకెఆర్ పురం పాఠశాలలను శనివారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్లు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు సునందన, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వరద నీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం జంక్షన్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీటి సమస్య పరిష్కరించాలని నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి రామ తీర్థం వెళ్ళే రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిల్వ కావడంతో వాహన దార్లు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పలుమార్లు నగర పంచాయతీ అధికార్లకు వరద నీటి సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.

ఉపాధి పనులకు అర్జీలు చేసుకోండి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ పంచాయతీలో ఉపాదిహామి పథకం పనులకు సంబంధించి జాబితాలో తప్పిపోయిన పనులకు మళ్లీ అర్జీలు చేసుకోవచ్చని ఎంపిడిఒ శ్యామల కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం మండల తీర్మానం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామపంచాయతీ ద్వారా తీర్మాణం చేసిన పనులకు జాబితాలో తప్పిపోయి ఉంటే రెండు రోజుల్లో అర్జీలు చేసి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఇసి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.140 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఉపాధి హామీ కింద 22 పంచాయతీల్లో 2174 పనులు చేపట్టడానికి 140.54 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎపిఒ త్రినాథరావు తెలిపారు. ఉపాధిహామీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామసభల్లో ఈ పనులు గుర్తించామన్నారు. సిసి రోడ్లు, డ్రెయిన్లు, డబ్ల్యుబిఎం, బిటి రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కొత్తగా మట్టి రోడ్లు, రింగ్ ట్రెంచెస్, ఫారంపాండ్లు, హార్టికల్చర్, గోకులాలు, పశువుల షెడ్లు, సెరీ కల్చర్ షెడ్లు, ఎవెన్యూ ప్లాంటేషన్స్ చేపడతామని వివరించారు.

చిన్నారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-చీపురుపల్లి

వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అందజేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని దేవాంగుల వీధిలో వినాయక ఉత్సవాలలో భాగంగా చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి శ్రీనివాసనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వేలంలో గెలుపొందిన లడ్డూని భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ ప్రభాత్, చిన్ని, సంతోష్, గొల్ల, శివ, వెంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కొట్టాం యువత విరాళం

విజయనగరంకోట : ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన యువకులు గ్రామంలో ప్రజల నుంచి రూ.40 వేల మొత్తాన్ని విరాళాలుగా సేకరించి శనివారం కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. గ్రామానికి చెందిన గొరపల్లి ఈశ్వరరావు, వేచలపు మహేష్, తగరంపూడి సన్యాసిరావు, గుర్రపు శ్రీనివాసరావు ఒక జట్టుగా ఏర్పడి గ్రామంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు గ్రామస్థుల నుంచి సేకరించారు. వీరిని కలెక్టర్ అభినందించారు.

దత్తిరాజేరు, బాడంగి మండలాల్లో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన

సంక్షోభంలోనూ సంక్షేమం : మంత్రి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం చేపట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలో దత్తి గ్రామంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇది మంచి ప్రభుత్వం అనేలా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్ల పునప్రారంభం, ల్యాండ్ టైట్లింగ్ యాక్టర్ రద్దు వంటి హామీలను నెరవేర్చామని తెలిపారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా చేయడం ప్రజలంతా తనకిచ్చిన వరమని, అందుకోసం నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా పనిచేస్తానని తెలిపారు. అందుకోసం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రాపు సురేష్, బిజెపి నాయకులు రెడ్డి పావని, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్.. మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

జిల్లాలో పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

నెల్లిమర్ల, వేపాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఇది ముంచే ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది మంచి ప్రభుత్వం కాదని ప్రజలను నట్టేట ముంచే ప్రభుత్వం అని వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి వందరోజులైన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ప్రజల్లోకి వెల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ వంద రోజులలో ప్రజలకు ఏం వెలగబెట్టారని ఇంటింటికి వెళుతున్నారో చెప్పాలన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు చేయలేకపోయారనా? లేక ఈ వంద రోజులలో రెండు లక్షల మంది లబ్ధిదారులకు ఫింఛన్లు తీసేసామని చెప్పడానికి ప్రజల్లోకి వెలుతున్నారా? గెలిచిన వెంటనే డిఎస్‌సి ద్వారా 50 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వ లేక పాయారని ప్రజల్లోకి వెలుతున్నారా? అని ప్రశ్నించారు. ఉచిత ఇసుక అని చెప్పి ఇసుక లేకుండా చేసారని దీని కారణంగా భవన కార్మికులతో పాటు రాష్ట్రంలో లక్షలాదిమంది రోడ్డున పడ్డారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు గొర్లె శ్రీరాములనాయుడు, పతివాడ రాజారావు, రేవల్ల సత్యనారాయణ, కోరుకొండ దాలయ్య, పాండ్రంకి వాసుదేవరావు, కరణపు ఆదినారాయణ, యల్ ప్రభాత్ కుమార్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు బాలికల ఎంపిక

ప్రజాశక్తి- గరివిడి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలలో కాపుసంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన రఘుమండ అనూష, ఇప్పిలి జెనీలియా, పొన్నాడ భవాని జిల్లా నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం డి. రాము తెలిపారు. ఈ నెలాఖరున జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని ఆయన చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులను సర్పంచ్ లెంక సుశీలమ్మ, గ్రామపెద్దలు పైల బలరాం, లెంక శ్రీరాములు, ఎంపిటిసి టి.సంజీవరావు, స్కూల్ కమిటీ చైర్మన్ పిన్నింటి రామకృష్ణ, యువజన నాయకులు చందక బాలకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మికి రాష్ట్ర స్థాయి మెరిట్ అవార్డు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నేషనల్ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్స్ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెరుమాలి లక్ష్మికి రాష్ట్రస్థాయి మెరిట్ అవార్డు వచ్చిందని హెచ్ఎం రాము తెలిపారు. తనతోపాటు పాఠశాలకు చెందిన పెన్నింటి చందు, గొర్లె స్వాతి, దాసరి భార్గవి, గొర్లె లహరి భార్గవి, పెనుమజ్జి స్వాతికి హార్ట్ స్పెషల్ సర్టిఫికెట్లు, బహుమతులు నిర్వాహకులైన తెలుగు ప్రపంచ చిత్రకారుల సమాఖ్య పాఠశాలకు పంపించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం డి.రాము, పిఇటి ఉదయ్‌కుమార్

ఇసుక అక్రమ రవాణా

అడ్డగించిన టైరుబండ్ల కూలీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఇసుక అక్రమ రవాణాను టైరుబండ్ల కూలీలు అడ్డుకున్నారు. ఈ సంఘటన శనివారం మండలంలో గోస్తనీ నది పరివాహక ప్రాంతంలో చోటుచేసుకుంది. మండలంలోని వేములపల్లి, మామిడిపల్లి గ్రామాల కూలీలు గోస్తనీ నదిలో ఇసుకను టైరుబండ్లపై తెచ్చుకొని రోజువారి జీవనం సాగిస్తున్నారు. టైరుబండ్లను గోస్తనీ నదిలోకి దిగనివ్వకుండా ట్రాక్టర్ల యజమానులు ఆంక్షలు విధించారు. రోజువారి కూలీలుగా ఇసుకని తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చినా ఆ గ్రామాల ట్రాక్టర్ల యజమానులు అడ్డగిస్తున్నారని టైరుబండ్ల కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ రాత్రి వేళలో ట్రాక్టర్లపై ఇసుకను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఇలా శనివారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను టైరు బండ్ల కూలీలు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ విఎన్ మూర్తి సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కూలి రేట్లు ఒప్పందం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎపి బెవరెజెస్ హమాలీలకు కూలీ రేట్ల ఒప్పందం చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ప్రభుత్వం మద్యం పాలసీ తీసుకొచ్చిన నేపథ్యంలో పాత కూలీ రేట్లు ఒప్పందం పూర్తయి రెండేళ్లు అయినా కొత్త ఒప్పందం చేయలేదని తక్షణమే కొత్త ఒప్పందం చేయాలని కోరుతూ శనివారం ఏపీ బెవరిజెస్ హమాలీలు డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్మికులకు కూలీ రేట్లు ఒక బాక్స్‌కి రూ.7.35 నుంచి 8 రూపాయలకి పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, డిపో కార్యదర్శి కార్తిక్, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-రామభద్రపురం

అక్రమ వ్యాపారాలు, రవాణా కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఎస్ఐ ప్రసాద్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మందుగుండు సామగ్రి తయారీ, రవాణా, అమ్మకాలకు లైసెన్స్ తప్పనిసరని స్పష్టం చేశారు. మద్యం, నాటుసారా, గంజాయి, మాదక ద్రవ్యాల నిల్వలు, బహిరంగ మద్యపానం వంటి చర్యలు చట్ట వ్యతిరేకమన్నారు.

గురజాడ రచనలతో సామాజిక చైతన్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

మహాకవి గురజాడ అప్పారావు తన రచనలతో సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో శనివారం గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, కౌన్సిలర్ హైమావతి పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాం శాఖ గ్రంథాలయంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి హెచ్ఎం ఎస్ఎస్ రమేష్, గ్రంథాలయ అధికారి కృష్ణమూర్తి నివాళులర్పించారు.

డైట్‌లో గురజాడ జయంతి వేడుకలు

నెల్లిమర్ల : ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో శనివారం అభ్యుదయ కవితా పితా మహుడు గురజాడ అప్పారావు 163వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర చాత్రోపాధ్యాయులు కన్యాశుల్కం నాటకంలో గిరీశం పాత్ర, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, దేశభక్తి గేయాలు ప్రదర్శించి ఆలపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు, పి.రవి కుమార్, కె. సూర్యారావు, ఎం. రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో గురజాడ జయంతి

విజయనగరం కోట : వాడుక భాషకు ఎంతో ప్రాధాన్యతనిచ్చి రచనలు చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని తెలుగు భాషా సేవా సంఘ అధ్యక్షులు ఆర్ .బి. రామానాయుడు అన్నారు. శనివారం గాజులు రేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో గురుజాడ 162 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలకు గురజడ వివిధ వేషధారణ వేయించి అనంతరం పలకలపై సమాజ వెలుగు జాడ గురజాడ అని రాసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి.. గురజాడకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా అధ్వానంగా ఉన్న గజపతినగరం నుంచి మెంటాడ రోడ్డు మోకాలు లోతు నీటితో నిండిపోయింది. రోడ్డంతా గతుకుల మయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈదురుగాలుల బీభత్సం

శృంగవరపుకోట :పట్టణంలో ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. దీంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఈదురుగాలులకు హోర్డింగులు విరిగిపడ్డాయి. విశాఖ-అరకు మార్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద, సాయిబాబా మందిరం వద్ద రోడ్లపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఫుట్‌పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ అపచారం : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

కల్తీ నెయ్యితో తిరుపతి లడ్డు తయారు చేయడం అపచారమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం తిరుపతి లడ్డును జంతువుల కొవ్వు కలిసిన కల్తీ నెయ్యితో తయారు చేయడం భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేనని తెలిపారు. గతంలో తిరుపతి లడ్డు మూడు వారాల వరకు నిల్వ ఉండేదని, వైసిపి ప్రభుత్వ హయాంలో నిల్వ ఉండే పరిస్థితి లేదని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిందన్నారు. తిరుపతి యాత్రికులకు ఆకలి తీర్చేందుకు పెట్టే అన్నప్రసాదంలో కూడా నాణ్యత లోపించిందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే బేబినాయన శనివారం ఆర్థిక సాయం అందించారు. ఎంఆర్ అగ్రహారం గ్రామంలో ఐదు రోజుల క్రితం చెట్ల తవుడు రెండు ఆవులు కరెంట్ షాక్‌కు గురై చనిపోయాయి. ఆ విషయం తెలుసుకొని ఆ రైతుకు ఎమ్మెల్యే రూ.20 వేలు అందించారు. తమ్మయ్యవలసలో బొత్స ఈశ్వరమ్మ ఇంటిపై పిడుగు పడి టీవీ, మోటారు, ఇంట్లో ఉన్న సామాన్లు ధ్వంసమయ్యాయి. ఆ కుటుంబానికి రూ.10 వేలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎం.ఆర్.అగ్రహారం సర్పంచ్ లొట్టి వెంకట్రావు, రంగప్పవలస మాజీ సర్పంచ్ శనపతి కృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా పంపిణీ చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి కోరారు. స్థానిక 28వ వార్డులో శనివారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు మరణాలను నివారించేందుకు ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తుందన్నారు. సరుకులు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.నిర్మల, మహిళా పోలీసులు నాగమణి, సూరిప్రభ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతంలో ముగిసిన రోబోటిక్స్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సిక్స్ సెన్సెస్ ఆఫ్ రోబోట్ అనే అంశంపై మూడు రోజుల కార్యశాల విజయవంతమైంది. ప్రముఖ రోబోయిన్ సంస్థ తోడ్పాటుతో నైజీరియన్ దేశానికి చెందిన రోబోటిక్ యంత్రాల నిపుణులు రహీమ్ క్యాడన్స్ కోడింగ్, ఆర్డ్యునో పనితీరును, వాటి మెళుకువలను నేర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వీ రామమూర్తి, మెకానికల్ విభాగదిపతి శ్రీమతి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొన్న వస్తువులకు బిల్లు తప్పనిసరి

ప్రజాశక్తి-బొబ్బిలి

కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకోవాలని వినియోగదారుల ఫోరం న్యాయమూర్తి ఆర్.వెంకట నాగసుందర్ అన్నారు. స్థానిక రఘు జూనియర్ కళాశాలలో శనివారం వినియోగదారుల రక్షణ మండలి ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల్లో కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకుంటేనే వినియోగదారులకు న్యాయం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన వస్తువులో నాణ్యత లోపిస్తే వినియోగదారుల కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని చెప్పారు. తూనికలు, కొలతలు, నాణ్యతలో వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు ఎల్.సత్యం, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే వహిస్తే భవిష్యత్తు అంధకారమేనని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. కంటి సమస్యలకు ప్రాథమిక స్థాయిలో గుర్తించి, అవసరమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిచారు. 150మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు విశాఖకు చెందిన సంధ్య కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలోపడి సకాంలో వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో సమస్యను గుర్తించి, అవసరమైన చికిత్స అందిస్తే భవిష్యత్తులో కండ్లకు ఎటువంటి సమస్యలు రావన్నారు కార్యక్మంలో డిఎస్‌పిలు, సిఐటు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

వేగంగా క్లౌడ్ టెక్నాలజీ అభివృద్ధి

ప్రజాశక్తి భోగాపురం

ఐటీ పరిశ్రమల్లో క్లౌడ్ టెక్నాలజీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని పూణేకు చెందిన క్లౌడ్ ఫ్లాట్ ఫారం అనుభవజ్ఞులు జితేంద్ర గుప్తా అన్నారు. మండలంలోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు గూగుల్ క్లౌడ్ ఫ్లాట్ ఫారంపై జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేంద్ర గుప్తా మాట్లాడుతూ ఐటీ రంగంలో గూగుల్ క్లౌడ్ ఫ్లాట్ ఫారంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన వడ్లమని మధు, టిసిఎస్ గ్లోబల్ హెడ్ బాల ప్రసాద్ పెడగిరి తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గూగుల్ క్లౌడ్ ఫ్లాట్ ఫారం సేవలు, టూల్స్, డేటాబేస్ మేనేజ్మెంట్, ఆపరేషన్, మిషన్ లెర్నింగ్, సెక్యూరిటీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వీధి కంపెనీకి చెందిన ప్రతినిధులు తెంటు అనిల్, రవిశంకర్ సారేపల్లి, కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు, ఎస్‌వి రమణమూర్తి పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలను పెంచేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు ఒకటిన మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబర్ 9, 10న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెవివి మండల గౌరవ అధ్యక్షులు కె.కృష్ణదాసు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఆనెం శ్రీనివాసరావు, సభ్యులు ఎస్.శివకుమార్, శివశంకర్ పాల్గొన్నారు.